



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న బాలిక

పేదోడికి పట్టెడన్నం

అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం

రూ.5కే కడుపునిండా ఆహారం

- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం
- పేదలు, కూలీల కళ్లల్లో ఆనంద బాష్పాలు
- శుచిగా, రుచిగా హరే కృష్ణ మూవ్‌మెంట్ వంటకాలు

ఈ రోజుల్లో ఐదు రూపాయలు పెడితే ఏమి వస్తుంది?.. కనీసం టీ కూడా రాదు. కానీ, కూటమి ప్రభుత్వం ఆ ఐదు రూపాయలకే పేదలకు కడుపు నిండా రుచికరమైన భోజనం అందించేందుకు సిద్ధమైంది. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో నిర్వహించిన 'అన్న క్యాంటీన్ల'ను గురువారం జీవీఎంసీ పరిధిలో పునఃప్రారంభించింది. వీటి ప్రారంభంపై రోజువారీ పనులు చేసుకునేవారు, పేదలు, నిరుద్యోగ యువత అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు పూటలూ కడుపు నిండా తింటామని, ఇక ఆకలితో గడపాల్సిన అవసరం లేదని అంటున్నారు. జీవీఎంసీ పరిధిలో మొత్తం 25 అన్న క్యాంటీన్లకు గాను గురువారం పద్దెనిమిదింటిని ప్రారంభించారు. శుక్రవారం మరో ఐదు, శనివారం మిగిలిన రెండు ప్రారంభించనున్నారు.



ఎంవీపీ రైతుబజార్ వద్ద గురువారం రాత్రి అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాలు వడ్డిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

పేదలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న 'అన్న క్యాంటీన్లు' అందుబాటులోకి వచ్చాయి. జీవీఎంసీ పరిధిలో 18 క్యాంటీన్లను కూటమి నేతలు గురువారం రాత్రి ప్రారంభించారు. పేదలు, కూలీలు ఆకలితో ఉండకూడదని, ప్రతి ఒక్కరూ కడుపు నిండా తిని నచ్చిన పనులు చేసుకోవాలని కూటమి ప్రభుత్వం వీటిని పునఃప్రారంభించింది. కేవలం ఐదు రూపాయలకు ఇక్కడ ఆహారం అందిస్తారు. ఉదయం పూట టిఫిన్‌గా ఇడ్లీ/పూరీ/ఉప్మా/పొంగల్; మధ్యాహ్న భోజనంలో అన్నం, కూర, సాంబారు, పెరుగు, పచ్చడి ఉంటాయి. రాత్రి భోజనంలో కూడా అలాగే ఉంటాయి. వంటకాలన్నీ శుచిగా, రుచిగా ఉండేందుకు ఎంతో పేరు ప్రఖ్యాతులు, సేవాభావం ఉన్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. వీరు ప్రస్తుతం అక్షయ పాత్రకు చెందిన కంచరపాలెం వంటశాలలో ఈ వంటకాలను తయారు చేసి వేడి వేడిగా క్యాంటీన్లకు పంపుతున్నారు. త్వరలో సొంతంగా వంటశాల ఏర్పాటు చేసుకొని అక్కడే వంటలు చేస్తారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ... మిగతా 4వ పేజీలో



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న దివ్యాంగుడు

చాలా ఆనందంగా ఉంది

- మరిస గోవిందరావు



రోజువారీ పనులకు వెళ్లే మాలాంటి వారికి అన్న క్యాంటీన్ల వల్ల మేలు జరుగుతుంది. కేవలం 5 రూపాయలకే నాణ్యమైన భోజనం లభించడం సంతోషకరం. ఏదో ఒక్క పూటకే పరిమితం చేయకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందుబాటులో ఉండడం వల్ల వివిధ ప్రాంతాల నుంచి నగరానికి అవసరాల నిమిత్తం వచ్చేవారికి ప్రయోజనం కలుగుతుంది. క్యాంటీన్లు మళ్లీ ప్రారంభించిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

ముందే మెనూ సిద్ధం

అన్న క్యాంటీన్ల ద్వారా ఏ రోజు, ఏ పూట ఏ ఆహారం ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ముందే మెనూ తయారుచేసింది. దానిని హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు ఇచ్చి, ఆ ప్రకారం తయారు చేయాలని ఆదేశించింది. ఈ ఆహార పదార్థాలు కూడా లెక్క ప్రకారం ఇస్తారు.

టిఫిన్: సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు టిఫిన్ అందుబాటులో ఉంటుంది. ఇందులో మూడు ఇడ్లీతో చట్నీ లేదా సాంబార్, పొడి ఇస్తారు. మూడు పూరీలను కుర్మాతో ఇస్తారు. ఇడ్లీ రోజూ ఉంటుంది. పూరీ సోమ, గురువారాల్లో చేస్తారు. మంగళవారం, శుక్రవారాల్లో ఉప్మా, బుధవారం, శనివారాల్లో పొంగల్ ఉంటుంది. వీటితో చట్నీ లేదా పొడి/సాంబారు/మిక్చర్ ఇస్తారు. ఉప్మా, పొంగల్ 250 గ్రాములు ఉంటాయి. చట్నీ/పొడి 15 గ్రాములు, సాంబారు 150 గ్రాములు, మిక్చర్ 25 గ్రాములు ఇస్తారు.

లంచ్, డిన్నర్: మధ్యాహ్నం భోజనం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు, రాత్రి భోజనం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు ఉంటుంది. భోజనంలో అన్నంతో పాటు కూర, పప్పు/సాంబారు, పెరుగు, పచ్చడి ఇస్తారు. అన్నం 400 గ్రాములు, సాంబారు 120 గ్రాములు, కూర 100 గ్రాములు, పచ్చడి 15 గ్రాములు, పెరుగు 75 గ్రాములు ఇస్తారు.

ఉక్కుకు 500 కోట్లు

- చట్టబద్ధమైన చెల్లింపులకే వాడాలంటూ నిబంధన
- ఇతరాలకు ఖర్చు చేస్తే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిక
- ఆ మొత్తంలో సగం జీఎస్‌టీ బకాయిల చెల్లింపులకే...
- కేంద్రం తీరు ఈ చేత్తో ఇచ్చి ఆ చేత్తో తీసుకున్నట్టుందంటూ ఉద్యోగుల విమర్శ
- పూర్తిస్థాయి ఉత్పత్తికి ముడి పదార్థాలు ఇవ్వాలి... లేనిపక్షంలో సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్



విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు తక్షణ సాయంగా రూ.500 కోట్లు విడుదల చేస్తున్నట్టు గురువారం ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే ఈ నిధులను చట్టబద్ధమైన చెల్లింపులకే ఉపయోగించాలని, దుర్వినియోగం చేస్తే చర్యలు చేపడతామని స్పష్టంచేసింది. చట్టబద్ధమైన చెల్లింపులు అంటే ఏమిటో కూడా మంత్రిత్వ శాఖే నిర్వచించింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్‌టీ, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌కు ఇవ్వాల్సిన మొత్తాలు, వెండర్ (విక్రేత) చెల్లింపులకు మాత్రమే ఈ నిధులు వినియోగించాలని పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు ఈ చెల్లింపుల బాధ్యత అప్పగించింది. ఉక్కు యాజమాన్యం, ఎస్‌బీఐ రెండూ చెల్లింపుల విషయంలో నిబంధనలు పాటించాలని సూచించింది.

ఏమేమి ఉన్నాయంటే..?

కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సాయం ఈ చేతితో ఇచ్చి ఆ చేతితో తీసుకున్నట్టుగా ఉందని ఉక్కు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. జీఎస్‌టీ బకాయిలు రూ.230 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఇప్పుడు ఇచ్చే రూ.500 కోట్లలో సగం జీఎస్‌టీకే పోతాయి. ఇక ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌కు నిధులు జమ చేయకపోతే కోర్టులో కేసుల వల్ల తల దించుకోవలసి వస్తుంది. అందుకని దానికి కొంత చెల్లించాల్సి ఉంది. విద్యుత్ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. వాటికి కడితే ఇక చేతిలో రూ.100 కోట్ల కంటే ఎక్కువ మిగలవు.

ముడి పదార్థాలు ఇవ్వండి చాలు

స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి తాము నిధులు కోరడం లేదని, ముడి పదార్థాలు బొగ్గు, ఐరన్ ఓర్ సరఫరా చేయాల్సిందిగా అడుగుతున్నామని, లేదంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నామని..వీటిని కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇలా రూ.500 కోట్లు, రూ.వేయి కోట్లు ఇస్తే ఏ మూలకు సరిపోవని అంటున్నారు. ఆస్ట్రేలియా నుంచి ... మిగతా 4వ పేజీలో

ఆత్మ గౌరవంతో ఆర్థిక స్వావలంబన సాధించండి

- దివ్యాంగులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపు
- ఏయూ మెరైన్ గ్రౌండ్‌లో దివ్య కళా మేళా ప్రారంభం
- హాజరైన కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్

- వార్త 10లో



దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ఉన్నారు



హనుమంతవాక జంక్షన్‌లో వర్షం

వర్షంతో సేదతీరిన నగరం

- మధురవాడలో పల్లపు ప్రాంతాలు జలమయం
- గంభీరంలో 60.5, మధురవాడ వాంబే కాలనీలో 55, ఎండాడలో 50.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోయిన నగరవాసులు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో సేదదీరారు. ఉదయం పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. పది గంటల నుంచి మళ్లీ ఎండ పెరిగింది. మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో ఐదు నిమిషాలపాటు మళ్లీ జల్లులు పడ్డాయి. ఆ తరువాత మళ్లీ మామూలే. అయితే సాయంత్రం నాలుగు గంటల తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీవర్షం కురిసింది. నగరం కంటే శివారు ప్రాంతాలు ముఖ్యంగా ఉత్తర భాగంలో కంబాలకొండ నుంచి ఆనందపురం వరకూ మంచి వర్షం కురిసింది. మధురవాడలో లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. ఆనందపురం మండలం గంభీరంలో 60.5 మిల్లీమీటర్లు, మధురవాడ వాంబే కాలనీలో 55, ఎండాడలో 50.25, మధురవాడలో 48.5, పెందుర్తిలో 36.5, కంబాలకొండలో 34.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.

తీరం కోతకు చెక్



కురుసుర మ్యూజియం వద్ద కోతకు గురైన తీరం

- కురుసుర మ్యూజియం వెనుక సముద్ర మట్టానికి మూడు మీటర్ల లోతులో 120 మీటర్ల మేర నిర్మాణం
- వీఎంఆర్‌డీ, నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థ ఒప్పందం
- ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకూ పలుచోట్ల కోతకు అడ్డుకట్ట
- రూ.200 కోట్లతో ప్రతిపాదనలు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకూ తీర ప్రాంతంలో కోత నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా కురుసుర మ్యూజియం వెనుక కోతను నివారించడానికి ఒక నిర్మాణం చేపట్టదలచింది. ఇప్పటికే తీరంలో కోతపై అధ్యయనం చేసిన నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థ, వీఎంఆర్‌డీఏ కలిసి ఈ ప్రాజెక్టు చేపడతాయి. అదేవిధంగా ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకూ కోత ఆందోళనకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ కూడా తగిన చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు సుమారు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థకు పంపాలని నిర్ణయించారు.

కురుసుర వెనుక నిర్మాణం...

కురుసుర మ్యూజియం వద్ద తీరం కోత చాలా ఎక్కువగా ఉంది. సుమారు ... మిగతా 4వ పేజీలో

ఇకనైనా కదులుతారా!?

భీమిలిలో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అక్రమ నిర్మాణాల కూల్చివేతపై జీవీఎంసీ నాన్చివేత ధోరణి

- పట్టనట్టు వ్యవహరిస్తున్న కూటమి నేతలు
- హైకోర్టు ఆదేశాల అమలుకు శ్రీకారం ఎప్పుడో మరి?



భీమిలిలో సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి చెందిన స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీగోడ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో అన్ని పనులూ అడ్డగోలుగా చేసిన అధికారులు...ఇప్పుడు అధికారికంగా ఆదేశాలు ఇచ్చినా కాలు కదపడం లేదు. ఈ విచిత్ర ధోరణి ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. కూటమి నేతలు కూడా పట్టించుకోవడం లేదు. ఎవరు ఏమి ఆశిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

వైసీపీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి విశాఖ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీకి చెందిన నేతల ఆస్తులను ఆక్రమణల పేరిట తెల్లవారక ముందే వందలాది బలగాలతో వెళ్లి కూలగొట్టించారు. గీతం కాలేజీ, సబ్బం హరి, పల్లా శ్రీనివాసరావు, హర్షవర్దన్...ఇలా అంతా బాధితులే. ముందస్తు నోటీసులు ఇచ్చి ఏ పనీ చేయలేదు. అడ్డగోలుగా వ్యవహరించారు. దానికి అధికారులు సహకరించారు. ఇక నాడు వైసీపీ నేతలు చేసిన అక్రమాలపై పలువురు హైకోర్టును ఆశ్రయించారు. వాటిపై విచారణ నిర్వహించి, అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు ఉంటే కూలగొట్టాలని తాజాగా ధర్మాసనం ఆదేశించింది. ఏ సాయిరెడ్డి అయితే ఇక్కడ విధ్వంసాలకు పాల్పడ్డారో...అదే సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి పేరుతో భీమిలి బీచ్‌లో భారీ రిసార్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేశారు. హైకోర్టు వాటిపై విచారణ నిర్వహించినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, కూల్చివేయాలని ఈ నెల మొదటి వారంలోనే ఆదేశించింది. కానీ జీవీఎంసీ అధికారులు నీళ్లు నములుతున్నారు. వైసీపీ హయాంలో అందలం ఎక్కిన జీవీఎంసీ అధికారులు 'సాయి భక్తి' చూపించారో, కూటమి నేతలు ... మిగతా 4వ పేజీలో

సింహాచలం దేవస్థానం ఈఓగా వేండ్ర త్రినాథరావు

- గతంలో పలుమార్లు ఇన్‌చార్జిగా బాధ్యతల నిర్వహణ



నూతన ఈఓ వేండ్ర త్రినాథరావు

సింహాచలం, సెప్టెంబరు 19: సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్, ప్రస్తుతం ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న వేండ్ర త్రినాథరావును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏడాదికాలంపాటు డిప్యుటేషన్‌పై ఈఓగా పనిచేసిన రెవెన్యూ శాఖకు చెందిన డిప్యూటీ కలెక్టర్ సింగాల శ్రీనివాసమూర్తిని మాతృశాఖకు బదిలీ చేస్తూ దేవదాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో విశాఖ జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాతను దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా ప్రభుత్వం నియమించింది. ఆమె ఈనెల 17న బాధ్యతలు స్వీకరించారు. అయితే గురువారం త్రినాథరావును నియమిస్తూ దేవదాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. త్రినాథరావు దేవస్థానానికి ఇన్‌చార్జి ఈఓగా 2020 సెప్టెంబరు 2 నుంచి 2021 జనవరి 22 వరకు ఒకసారి, 2022 సెప్టెంబరు 22 నుంచి 2023 జూన్ 10 వరకు మరోసారి, 2023 ఆగస్టు 26 నుంచి 2023 సెప్టెంబరు 17 వరకు ఇంకొకసారి విధులు నిర్వహించారు.

జోన్-4 జడ్సీగా మల్లయ్యనాయుడు బాధ్యతల స్వీకరణ



అల్లిపురం, సెప్టెంబరు 19: జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్‌గా ఎం.మల్లయ్యనాయడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జడ్సీగా ఉన్న ప్రసాద్ పదోన్నతిపై శ్రీకాకుళం బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన జడ్సీకి జోనల్ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జడ్సీ గతంలో జోన్-5, జోన్-8లలో కమిషనర్‌గా పనిచేశారు.

జోన్ 3 జెడ్సీగా శివప్రసాద్



సీతంపేట, సెప్టెంబరు 19: జీవీఎంసీ జోన్-3 కమిషనర్‌గా కె.శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో యల్లవరంలో విధులు నిర్వహించి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

కేజీహెచ్ ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా మెహర్‌కుమార్

మహారాణిపేట, సెప్టెంబరు 19: కేజీహెచ్ ఇన్‌చార్జ్ సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ మెహర్ కుమార్ నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కేజీహెచ్‌లో కొన్నేళ్లుగా సీఎస్ఆర్ఎంవో పోస్టు ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకు వస్తున్నారు. డాక్టర్ మెహర్ కుమార్‌కు పలువురు వైద్యులు, అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఆర్కేబీచ్‌లో శాంతియుత ర్యాలీ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19: దేశవ్యాప్తంగా అటవీ ఉద్యమాలకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు క్లీన్ క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధులు ఓఇంద్రిలా, అనిల్ తెలిపారు. అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసంతో అడవులకు ప్రమాదం వాటిల్లుతోందన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అడవులు, జీవవైవిధ్యానికి రక్షణ కోరుతూ శాంతి యుత ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు.



టర్నర్ చౌల్ట్రీ వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు



పూర్ణామార్కెట్‌లోని ఫ్రూట్ మార్కెట్ వద్ద ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర నేతలు

అన్న క్యాంటీన్ల ప్రారంభంతో హర్షాతిరేకాలు

» పేదలకు రూ.5 కే భోజనం వడ్డించిన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 19: తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరుతో పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు తిరిగి విశాఖలో ప్రారంభించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. గురువారం టర్నర్ చౌల్ట్రీ వద్ద అన్న క్యాంటీన్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలసి ఆయన ప్రారంభించారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకిచ్చిన వాగ్దానాల్లో ప్రధానమైన అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించడం పేద వర్గాలు, కార్మికులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. వైసీపీ హయాంలో అన్న క్యాంటీన్ల సేవలు పేదలకు దూరంచేసి వారి కడుపుకొట్టారన్నారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద అన్నక్యాంటీన్‌లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ పేదలకు ఆహార పదార్థాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, 30వ వార్డు కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, కూటమి శ్రేణులు యజ్ఞశ్రీ, అన్న ఎన్టీఆర్ సేవాసమితి కార్యవర్గ సభ్యుడు గంగాడ గోవింద్, జోన్ 4 కమిషనర్ మల్లయ్యనాయుడు, స్థానిక కూటమి నాయకులు పోలిపల్లి జ్యోతి, ప్రభాకర్, నందమూరి అభిమానులు అప్పలరాజు, వివిధ వార్డులకు చెందిన పార్టీ శ్రేణులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహారాణిపేట: విశాఖ దక్షిణ నియోజకవర్గం కేజీహెచ్, టర్నర్ చౌల్ట్రీ సెంటర్ పూర్ణామార్కెట్ సమీపంలోని ఫ్రూట్ మార్కెట్‌ల వద్ద అన్న క్యాంటీన్లను ఎంపీ శ్రీభరత్, శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ సౌత్ ఇన్‌చార్జు సీతంరాజు సుధాకర్‌లు ప్రారంభించారు పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ఎమ్ఎల్ఏ వంశీకృష్ణ మాట్లాడుతూ 5 రూపాయలకే నాణ్యమైన ఆహారం అందించటం గొప్ప విషయమని, పేద ప్రజలకు అవసరమైన చోట ఏర్పాటు చేశామన్నారు. కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్‌లో నేడు ప్రారంభం

అక్కయ్యపాలెం : గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్సార్ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్య నేతలు, వివిధ వార్డుల అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మాతృ మరణాలకు అవకాశమివ్వొద్దు

▸▸ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు



సమీక్షలో సూచనలు చేస్తున్న డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతమ్మధార, సెప్టెంబరు 19: ఇకముందు మాతృ మరణాలు జరగడానికి వీల్లేదని, ఏఎన్ఎంల నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టం చేశారు. ఎవరైనా గర్భిణులు అస్వస్థతకు గురైనప్పుడు సంబంధిత ఆరోగ్య కార్యకర్తలు ఆమెను వెంటనే డాక్టర్ వద్దకు తీసుకెళ్లి తగిన వైద్యం చేయించాలని ఆదేశించారు. మాతృ మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డాక్టర్ జగదీశ్వరరావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబరులో ఒక మాతృ మరణం సంభవించిందని, బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి చోటు చేసుకున్నట్లు విశ్లేషించారు. ఈ సమావేశంలో డాక్టర్ పూర్ణేంద్ర బాబు, డాక్టర్ ఎస్.జీవన రాణి, డాక్టర్ పి.ఉషా, ఆర్ఎంఒ ఏరియా ఆసుపత్రి (అగనంపూడి) గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, గైనకాలజిస్ట్(కేజీహెచ్) డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వై.మాధురి, డాక్టర్ బీ.వర్షిక, డాక్టర్ ఎస్‌సిటీ నాయుడు, బి.నాగేశ్వరరావు, డాక్టర్ రేవతి, మెడికల్ ఆఫీసర్, జి.శారదదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, వి.త్రినాథరావు, వైద్యాధికారులు నాగభూషణం పాల్గొన్నారు.

శస్త్రచికిత్సతో బాలుడికి కొత్త జీవితం



చికిత్స పొందిన బాలుడు చరణ్‌తో వైద్య బృందం

మహారాణిపేట, సెప్టెంబరు 19: మెదడుకు సంబంధించిన అరుదైన వ్యాధితో బాధపడుతున్న 11 ఏళ్ల బాలుడికి వైద్య చికిత్స అందించి కోలుకునేలా చేసింది కేజీహెచ్ వైద్య బృందం. అగనంపూడికి చెందిన చరణ్(11)కు మెదడు బాగా దెబ్బతినడంతో పోస్టీరియర్ ఎన్‌సెఫలోపతి మల్టీసిస్టం ఇన్‌ఫ్లమెటరీ సింద్రోమ్ వ్యాధికి గురయ్యాడు. ఆకస్మికంగా స్పృహతప్పడం, పట్టుకోల్పోవటం వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. ఖరీదైన వైద్యం అవసరమవడం, బాలుడి తండ్రి అప్పల నాయుడు రోజు కూలీ కావటంతో ఆగసు 31న కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. స్పృహలేని పరిస్థితిలో ఉన్న ఆ బాలుడికి మూడు రోజులు కృత్రిమ శ్వాస (వెంటిలేటరుపై)తో చికిత్స అందించారు. ఆ బాలుడికి ప్రాణాంతక పరిస్థితి వచ్చింది. కేజీహెచ్‌లో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చక్రవర్తి, డా.రత్నకుమారి, డా.సునీల్, డా.వాసు, డా.బంగారు, డా.కావ్య తదితర వైద్య బృందం బాలుడికి చికిత్స అందించింది. 21 రోజులు అందించిన చికిత్సతో బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. గురువారం డిశ్చార్జు అయ్యాడు. ఇదే చికిత్స ప్రైవేటు ఆసుపత్రిలో అయితే సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. కాని కేజీహెచ్‌లో ఉచితంగా వైద్య సేవలందించడంతో బాలుడి కుటుంబానికి ఊరట కలిగింది.

కొబ్బరితోటలో క్రేజీ అన్నదానం





కొబ్బరితోటలో భోజనాలు ఆరగిస్తున్న మహిళలు

అల్లిపురం, సెప్టెంబరు 19: వినాయక చవితి వేడుకల్లో భాగంగా జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోటలో గురువారం క్రేజీ అన్నదానం జరిగింది. క్రేజీబాయిస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం 20 వంటకాలతో భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి టిఫిన్లతో హోరెత్తించారు. సుమారు 2 వేల మందికి 2 లీటర్ల పరిమాణం గల శీతల పానీయాలు, మిఠాయిలు, బిరియానీలతో భోజనం పెట్టడంతో ప్రజలు ఎగబడ్డారు.

మద్రిపాలెం: గ్రేటర్ పరిధి 54వ వార్డు మద్రిపాలెం జ్యోతినగర్‌లో గురువారం అన్నసమారాధాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్‌కుట్టా పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. పరిసర కాలనీల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు దినేష్‌రెడ్డి, ప్రభాకర్, నాని, రాజేష్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనులు

▸▸ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్



వైద్యశిబిరంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ తదితరులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 19: అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వార్డులో అభివృద్ధి పనులు జరిగేలా చూస్తానని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ అన్నారు. గురువారం వార్డులో పూర్ణిమా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, దక్షిణ నియోజకవర్గం నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ, కోడిగుడ్ల శ్రీధర్‌లు ప్రారంభించారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు బీజేపీ అధ్యక్షుడు వంకా సంజీవ్, గంగారాం మాస్టర్, వెలంగిణిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు తీరం రక్షణకు 2 వేల కోట్లు

▸▸ ఏపీలో కోత నివారణకు 'షోర్' అమలుకు ప్రతిపాదనలు

▸▸ భీమిలి, విశాఖ కురుసుర, ఉప్పాడల్లో ప్రమాదకర స్థాయిల్లో తీరం కోత

▸▸ నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణమూర్తి



విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తీరం కోత నివారణకు రూ.2,000 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో 'షోర్' ప్రాజెక్టు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణమూర్తి వెల్లడించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. 'తీరం కోత నివారణకు తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో షోర్ ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. తూర్పు తీరంలో ఉన్న ఒడిశా ప్రభుత్వం కూడా ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఐదేళ్ల కాలపరిమితితో కూడిన ఈ ప్రాజెక్టు అమలు చేస్తే కోత నివారణ చాలావరకు అదుపులోకి తీసుకురావచ్చు. కోస్తాలో ఇచ్ఛాపురం నుంచి తడ వరకు సముద్ర కోతపై ఇప్పటికే మా సంస్థ అధ్యయనం చేసి నివేదిక విడుదల చేసింది. తీరం వెంబడి కృష్ణపట్నం, గోదావరి, కృష్ణా నదులు కలిసే ప్రాంతాలు, కాకినాడ సమీపంలోని ఉప్పాడ, విశాఖలో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, భీమిలి వద్ద కోత ఆందోళనకరంగా ఉందని గుర్తించాం. ప్రస్తుతం కోత తీవ్రంగా ఉన్న చోట్ల, భవిష్యత్తులో సమస్య ఎదుర్కొనే ప్రాంతాలు... ప్రధానంగా బురద, ఇసుక కలిసి ఉన్న ప్రదేశాల్లో మడ అడవులు పెంపకం ద్వారా తీరాన్ని కోత నుంచి రక్షించవచ్చు. తీరం భారీగా కోతకు గురయ్యే చోట్ల రక్షణ గోడలు నిర్మించడం, డ్రెడ్జింగ్ ద్వారా బీచ్‌లు ఏర్పాటు, సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న వర్గాలకు జీవనోపాధి కల్పించడం వంటివి ప్రతిపాదనల్లో పొందుపరిచాం. ఉప్పాడ సమీపంలో సుమారు 13 కి.మీ. పొడవునా తీరం తీవ్ర ఒత్తిడికి గురై భారీ కోతకు గురవుతుందని గుర్తించాం. శాశ్వత ప్రాతిపదికన ఉప్పాడ తీరంలో కోత నివారణకు రూ.250 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇప్పటికే తీరం వెంబడి ఉన్న రక్షణ గోడను మరింత పటిష్ఠం చేయడం, ఉప్పాడకు ఉత్తరాన ఉన్న ఫిషింగ్ హార్బర్ వద్ద కోత నివారణకు మడ అడవులు పెంపకం, ఇసుక తిన్నెల రక్షణ వంటి చర్యలు తీసుకుంటాం. ఏపీ కోస్తా మెరైన్ స్పెషల్ ప్లాన్ పేరిట మరో అధ్యయనం చేస్తున్నాం. మన సముద్ర జలాల్లో ఖనిజాలు, మెరైన్ సంపద వెలికతీత, అధ్యయనం కోసం ప్రత్యేకించి వెసల్ ఏర్పాటు, తుపాన్‌ల తీవ్రతను గుర్తించడం, సముద్రంలో విద్యుత్ ఉత్పత్తి, అవసరమైన ప్రాంతాల్లో సముద్ర నీటిని శుద్ధి చేయడం వంటి అంశాలపై 'డీప్ ఓషన్ మిషన్' ప్రాజెక్టు ప్రస్తుతం అమలు చేస్తున్నాం. దేశానికి కొరతగా ఉన్న కాపర్, కోబాల్ట్, ఇతర విలువైన ఖనిజాలు, ఎంతో విలువైన బయో డైవర్సిటీ ఉన్న మాలిక్యూల్ వెలికితీతపై పరిశోధనలు చేస్తున్నాం. ఐదేళ్ల కాలపరిమితితో మూడేళ్ల క్రితం ప్రారంభమైన మిషన్ మరిన్ని పరిశోధనల కోసం కేంద్రం గడువు పెంచే అవకాశం ఉంది' అని రమణమూర్తి అన్నారు.

పేదోడికి పట్టెడన్నం

... 3వ పేజీ తరువాయి

గురువారం కంచరపాలెం వెళ్లి ఈ వంటలు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. అధునాతన పరికరాలను ఉపయోగించి, నాణ్యమైన దినుసులతో వంటకాలు తయారుచేస్తున్న విధానాన్ని ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ భక్తదాస వివరించగా సంతృప్తి వ్యక్తంచేశారు. ఇక్కడి నుంచి వచ్చిన వంటకాలను అన్న క్యాంటీన్ల ద్వారా ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు ప్రజలకు వడ్డించారు. ప్రారంభం రోజు కావడంతో ఉచితంగానే భోజనాలు పెట్టారు. శుక్రవారం నుంచి డబ్బులు తీసుకొని వడ్డిస్తారు. ప్రతి ఆదివారం వీటికి సెలవు.

ఉక్కుకు 500 కోట్లు

... 3వ పేజీ తరువాయి

లక్ష టన్నుల బొగ్గును నౌకలో తెప్పించుకోవాలంటే... రూ.500 కోట్లు అవసరమని, ఇప్పుడు మంత్రిత్వ శాఖ ఇచ్చే నిధులతో ఏమీ కొనలేమని వాపోతున్నారు. రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్ తయారు చేయగల రూ.30 వేల కోట్ల విలువైన యంత్ర పరికరాలు వృథాగా ఉన్నాయని, వాటిని నడిపించాలనే తాము కోరుతున్నామని అంటున్నారు. ప్రైవేటు స్టీల్‌ప్లాంట్లు లాభాల్లో ఉంటే..విశాఖ స్టీల్ ఎందుకు నష్టాల్లో ఉందో ఆలోచించాలని మంత్రులు అంటున్నారని, గత మూడేళ్ల నుంచి ఈ స్టీల్‌ప్లాంటును ఢిల్లీ నుంచి కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖే నడుపుతోందని, ఈ మూడేళ్లలో జరిగిన దానికి వారే బాధ్యత వహించాలని, ఇక్కడి ఉద్యోగులు, కార్మికులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారని, అందుకే పోరాట బాట పట్టామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వాలని, లేదంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇకనైనా కదులుతారా!?

... 3వ పేజీ తరువాయి

అడ్డం పడ్డారో... తెలియదు గానీ తూతూమంత్రంగా కూల్చివేత పనులు జరిగాయి. ఈ విషయం కూడా హైకోర్టు దృష్టికి వెళ్లడంతో తాజాగా బుధవారం చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. నిర్మాణాలన్నీ వెంటనే కూల్చివేసి ఈ నెల 25వ తేదీ వాయిదా నాటికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

ఆ నిర్మాణాలన్నీ సీఆర్‌జెడ్-1లోనే...

భీమిలి బీచ్‌లో సీఆర్‌జెడ్-2లోనే నిర్మాణాలు చేపట్టామని, సీఆర్‌జెడ్-1లో కాదని నేహారెడ్డి తరఫు న్యాయవాదులు వాదించారు. కానీ న్యాయమూర్తి కోర్టుకు సమర్పించిన వీడియోలు, ఫొటోలు చూపించి, ఆ నిర్మాణాలన్నీ హైటైడ్ ప్రాంతం..అంటే తీరానికి 200 మీటర్ల లోపే...సీఆర్‌జెడ్-1లోనే ఉన్నాయని, కూల్చివేయాలని ఆదేశించారు.

నోటీసుకు సమాధానం లేదు

అనుమతులు లేని నిర్మాణాలు కూల్చివేయాలని కోర్టు ఆదేశిస్తే కేవలం ఒకవైపు ప్రహరీ గోడ పైపైన తొలగించిన జీవీఎంసీ అధికారులు...ఆ భూమిలో అప్పటికే ఉన్న పాత నిర్మాణాలకు అప్పట్లో తీసుకున్న అనుమతులు, కొత్త వాటికి తీసుకున్నామని చెబుతున్న అనుమతులు, ఆ భూములపై హక్కు పత్రాలు సమర్పించాలని మూడు రోజుల వ్యవధితో నోటీసు ఇచ్చారు. పది రోజులైనా దానిపై ఇంతవరకూ సమాధానం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు మరోమాటకు తావు లేకుండా హైకోర్టు ఆదేశాలతో అక్కడి నిర్మాణాలన్నీ కూల్చివేయవచ్చు. ఏమి చేస్తారో చూడాలి. ఇప్పుడు కూడా కూటమి నేతలు ఫోన్లు చేసి అడ్డం పడతారా?, లేక జీవీఎంసీలో 'సాయి భక్తులు' తూతూ మంత్రపు పనులు చేస్తే ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఊరుకుంటారా? చూడాలి.

తీరం కోతకు చెక్

... 3వ పేజీ తరువాయి

పదేళ్ల క్రితం రెండు పర్యాయాలు అక్కడ బీచ్‌రోడ్డు కోతకు గురైంది. కోత నివారణకు భారీగా బండరాళ్లు వేస్తే కురుసురకు ఉత్తరాన కోత మొదలైంది. ఈ నేపథ్యంలో కురుసుర వెనుక తీరంలో ఒక నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. తీరం నుంచి సముద్రంలోకి నీటి మట్టానికి మూడు మీటర్ల లోతున 120 మీటర్ల పొడవు, 20 నుంచి 30 మీటర్ల వెడల్పుతో సిమెంట్, కాంక్రీట్, స్టీల్‌తో ఒక నిర్మాణం చేపడతారు. దీనివల్ల అలల తీవ్రత తగ్గుతుంది. అదే సమయంలో సముద్రం నుంచి ఇసుక మేటగా వచ్చి బీచ్‌లో చేరుతుంది. ఇప్పటికే పుదుచ్చేరిలో అటువంటి నిర్మాణం చేపట్టగా కోత తగ్గింది. ఇక ఆర్కే బీచ్‌లో కోత తీవ్రంగా ఉన్నప్పటికీ అక్కడ సహజసిద్ధంగా ఉన్న రాళ్లతో బీచ్ సురక్షితంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే తరహాలో కురుసుర వద్ద అలల వేగం తగ్గించగలిగితే కోతకు అడ్డుకట్ట వేయవచ్చునని అంచనాకు వచ్చారు.

భీమిలి మునిసిపల్ కార్యాలయం వద్ద కోత నివారణకు చర్యలు

భీమిలి మునిసిపల్ కార్యాలయం వద్ద కోత ఎక్కువగా ఉందని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థ గుర్తించింది. అక్కడ కూడా కోత నివారణకు చర్యలు తీసుకుంటామని ఈ సంస్థ డైరెక్టర్ ఎంవీ రమణమూర్తి వెల్లడించారు. ఇంకా ఫిషింగ్ హార్బర్‌కు ఉత్తరాన, భీమిలి వరకూ ఇంకా పలుచోట్ల కోత ఉన్నట్టు తమ పరిశోధనలో వెల్లడైందని, దశలవారీగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు తీరంలో కోతపై ఇప్పటికే తాము అధ్యయనం చేసినందున కోత నివారణకు వీఎంఆర్‌డీఏతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.

వన్‌టౌన్‌లో మళ్లీ కొళాయి నీటి సరఫరా బంద్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 19: వన్‌టౌన్ ప్రజానీకాన్ని నీటి సమస్య వెంటాడుతోంది. జీవీఎంసీ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారినా చక్కదిద్దే నాథుడు లేడు. గురువారం 30వ వార్డు నుంచి పాతపోస్టాఫీసు 39వ వార్డు వరకు కుళాయి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు కొళాయిల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. ముందస్తు సమాచారం లేకుండా కొళాయి నీటి సరఫరాను నిలిపివేయడం దారుణమని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయకపోవడం పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటిని సక్రమంగా సరఫరా చేయాలంటున్నారు.

వీటీ హైస్కూల్ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు

సీతంపేట, సెప్టెంబరు 19: సీతంపేట రాజేంద్రనగర్‌లోని వి.టి. హైస్కూల్‌లో నెలవారీ ఫీజు చెల్లించలేదని విద్యార్థులను యూనిట్ పరీక్షలు రాయకుండా నలభై నిమిషాల పాటు తరగతి గది బయట నిలబెట్టారు. ఈ విషయం తెలుసుకుని వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులపై స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయ యాజమాన్యం తిరగబడి కేకలు వేశారు. మీసాల ఆదినారాయణ ఇద్దరు పిల్లలు ఈ స్కూల్‌లో చదువుతున్నారు. వీరిలో ఒకరి నెలవారీ ఫీజు చెల్లించలేదు. దీంతో ఈ నెల 18న ఆ విద్యార్థినికి యూనిట్ పరీక్ష రాయించకుండా 40 నిమిషాల పాటు తరగతి గది బయటనే నిలబెట్టారు. ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలిపి మనోవేదనకు గురైంది. దీంతో గురువారం ఆదినారాయణ తన భార్యతో కలిసి స్కూల్‌కి వచ్చాడు. ఫీజు కొద్ది రోజుల్లో చెల్లిస్తామని కరస్పాండెంట్ రమణకు తెలిపారు. దీంతో తమ దంపతులపై దురుసుగా వ్యవహరించి బయటకు పొమ్మన్నారని ఆరోపించారు. దీంతో ఆదినారాయణ ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు స్కూల్ ప్రతినిధులను స్టేషన్‌కి పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి ఇకపై ఫీజుల విషయంలో ఒత్తిడి చేయరాదని సూచించి బైండోవర్ రాయించి పంపివేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కంచరపాలెం, సెప్టెంబరు 19: కంచరపాలెం దరి ఐటీఐ జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలో నివాసముంటున్న ఎస్.సంతోష్ కుమార్ (28) రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూంలో విధులు నిర్వహిస్తున్నాడు. సంతోష్ కుమార్ గురువారం ఉదయం 10 గంటల సమయంలో మెట్టు నుంచి ఐటీఐ జంక్షన్‌కు వెళ్తుండగా ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించబోయి అదుపు తప్పి బస్సు కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే సంతోష్‌కుమార్ మృతిచెందాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఏఎస్ఐ కె.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగడాలు శ్రుతిమించితే ఫిర్యాదు చేయండి

▸▸ ఆకతాయిల చేష్టలపై ప్రజలకు కార్పొరేటర్, సీఐ సూచన



ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, కార్పొరేటర్

అల్లిపురం, సెప్టెంబరు 19: ఆకతాయిల ఆగడాలు ఉపేక్షించేది లేదని 32వవార్డు కార్పొరేటర్, జనసేన నాయకులు కందుల నాగరాజు అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం టూటౌన్ సీఐ తిరుమలరావుతో కలసి చలువతోట, ఎల్లపువారి వీధి, నేరెళ్ల కోనేరు, ఎస్ఆర్ఎంటీ ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ శృతి మించితే వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో కందుల కృష్ణ,సీపీఐ బుజ్జి, ఆదిబాబు, కందుల బద్రినాథ్, కేదారనాథ్‌లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

కూటమి ప్రభుత్వంతోనే ఏపీకి ఊపిరి

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, సెప్టెంబరు 19: కూటమి ప్రభుత్వ ప్రజాపాలనతోనే రాష్ట్రానికి ఊపిరి వచ్చిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం సుజాతనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పాతాళంలో ఉన్నా దివ్యాంగులు, సామాజిక పింఛన్లను పెంచడం జరిగిందన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు అందుతున్నాయన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు ఊపిరి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గంలో వారం రోజుల పాటు వందరోజుల పాలన గురించి ప్రజలకు వివరించేలా 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీలు రెడ్డి నారాయణరావు, పైలా జగన్నాథం. టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, నాయకులు మధు, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీగా శేషాద్రి బాధ్యతలు స్వీకరణ



బి.శేషాద్రి

గాజువాక, సెప్టెంబరు 19: జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌గా బి.శేషాద్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రేపల్లి మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన్ను ప్రభుత్వం గాజువాక జెడ్సీగా బదిలీ చేసింది. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

సీతారామ్ ఏచూరికి నివాళి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 19: కార్మిక, కర్షక సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై అవిశ్రాంత పోరాటం చేసిన ఘనత సీపీఎం అగ్రనేత సీతారామ్ ఏచూరికే దక్కుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. బెల్ టౌన్‌షిప్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఏచూరి సంతాప సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏచూరి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులు జీటీపీ ప్రకాశ్, జె.అయోధ్యరామ్, ఉరుకూటి బాబూరావు, కొల్లి దేముడు, ఎస్.జ్యోతీశ్వరరావు, జి.స్వామినాథన్, వై.సత్యవతి, పీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

గోపాలపట్నం, సెప్టెంబరు 19: స్థానిక రైతుబజారు ప్రాంగణంలో గల అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఉదయం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

మల్కాపురం, సెప్టెంబరు 19: కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం కింద రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ఇక్కడి సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ప్రైవేటు, కాంట్రాక్టు కార్మికులకు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తక్షణమే పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 30న దేశవ్యాప్తంగా ధర్నాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముందుగా సీపీఎం అగ్రనేత సీతారామ్ ఏచూరి, గాయకుడు, రచయిత సన్యాసిరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మణమూర్తి, జి.నరేశ్, కె.రమణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 52, టమాటా 40, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 24, క్యారెట్ 36, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 54, బరబాటి 44, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడుచిక్కుడు 75, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు		
బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు



వేపగుంట అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న పంచకర్ల, గండి బాబ్జీ, తదితరులు

అట్టహాసంగా అన్న క్యాంటీన్లు ప్రారంభం

అన్నార్తుల ఆకలి తీర్చేందుకే పునఃప్రారంభం: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

పరబ్రహ్మ స్వరూపమైన అన్నాన్ని ఎవరూ వృథా చేయవద్దు: పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

పెందుర్తి, సెప్టెంబరు 19: పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు గురువారం పలుచోట్ల అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పెందుర్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు గురువారం రాత్రి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నార్తుల ఆకలి తీర్చేందుకే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందన్నారు. అనంతరం వారు జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కూటమి నాయకులతో కలిసి భోజనం చేసి ఆహార పదార్థాల నాణత్యను పరిశీలించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాన్ని ప్రగతిపథంలోకి తీసుకువెళుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్సీ హైమావతి, కార్పొరేటర్ శేనాపతి వసంత, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, కూటమి నాయకులు వేగి పరమేశ్వరరావు, డీబీఎల్ నాయుడు, గొర్లె రాము నాయుడు, సింహాచలం, దాట్ల మధు, కరక దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని శ్రీహరిపురం, గాజువాక ఆర్టీసీ డిపో వద్దనున్న అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరబ్రహ్మ స్వరూపమైన అన్నాన్ని ఎవరూ వృథా చేయవద్దని, ప్రతి మెతికను అందరూ ఎంతో గౌరవంగా చూడాలన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలలో నాశనం చేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం నెమ్మదిగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. అనంతరం ఆయన తల్లి, కుమారుడు, కోడలు, పలువురు నాయకులతో కలిసి శ్రీహరిపురం అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, కూటమి నాయకులు మాతా శ్రీను, కోరాడ శ్రీనివాసరావు, పొత్తబత్తుల శ్రీను, రామ్మోహన్‌నాయుడు, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, అంగ దుర్గాప్రశాంతి, ఎం.చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: వేపగుంట రామాలయం ఎదురుగా అన్న క్యాంటీన్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుందన్నారు. గండి బాబ్జీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేదోడికి పట్టెడన్నం పెట్టిన అన్న క్యాంటీన్లను మూసివేసిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జెడ్సీ కె.హైమావతి, ఈఈ రత్నాకర్, డీఈ విజయ్‌కుమార్, కూటమి నాయకులు పిన్నింటి పార్వతి, ఎస్.అప్పారావు, వేణు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో భోజనాలు వడ్డిస్తున్న కార్పొరేటర్లు, కూటమి నాయకులు



శ్రీహరిపురం అన్న క్యాంటీన్‌లో తల్లి, కుమారుడు, కోడలు, తదితరులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు



గాజువాక వంటిల్లు కూడలిలోని క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న ప్రజలు

ఆటోనగర్: ఆటోనగర్‌లోని అన్న క్యాంటీన్‌ను టీడీపీ కార్పొరేటర్లు రాజాన రామారావు, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, కూటమి నాయకులు బొడ్డు నరసింహపాత్రుడు, పప్పు రాజారావు, పులి వెంకటరమణా రెడ్డి, డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు, కోన తాతారావులు సంయుక్తంగా అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అన్న క్యాంటీన్‌ను మళ్లీ ప్రారంభించడం పట్ల పేదలతో పాటు సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, రాజాన రామారావులు మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం మూసివే యడంతో ఐదేళ్ల పాటు పట్టెడన్నం కోసం పేదలు నానాపాట్లు పడ్డారన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నంరెడ్డి అన్నపూర్ణ, పావని, దేనంకొండ కృష్ణంరాజు, పప్పు శంకరరావు, విజయరామరాజు, సూరిశెట్టి పెంటా రావు, పి.దానయ్య, రాజన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాకలోని వంటిల్లు కూడలిలో అన్న క్యాంటీన్‌ను గురువారం రాత్రి జోనల్ కమిషనర్ శేషాద్రి ప్రారంభించారు. సుమారు ఐదు వందల మందికి అన్నం, సాంబారు, ఫ్రై కర్రీ, పెరుగుతో భోజనం అందించారు. శుక్రవారం నుంచి ఉదయం 300 మందికి టిఫిన్లు, మధ్యాహ్నం, రాత్రి 300 మందికి చొప్పున భోజనాలు అందించనున్నారు. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

- 1, 2, 3 తేదీల్లో నిర్వహణ
- పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 19: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అక్టోబరు 1,2,3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళనలకు కార్మికులంతా సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,316వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మూడున్నరేళ్లుగా ఉక్కు కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. ఉక్కుకు వేధిస్తున్న ముడిసరకు సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ముడిసరకు తగ్గడం వల్ల ఉత్పత్తి తగ్గి, కర్మాగారం నష్టాలు బారినపడుతుందన్నారు. కార్మికులంతా వంద శాతం ఉత్పత్తిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపితే ఏడాదికి సుమారు రూ.ఐదు కోట్ల వరకు లాభం వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉక్కు కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదినారాయణ కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.ఆనంద్, జె.రామకృష్ణ, కె.రాజబాబు, నాయుడు, వరప్రసాద్, దుర్గారావు, ఈశ్వర్, రమణ, గోవింద్, కాంగ్రెస్ నాయకుడు డి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ



రామచంద్రరావుకు స్వాగతం పలికిన దళిత సంఘాల నాయకులు, తదితరులు

షిప్‌యార్డును సందర్శించిన ఎస్సీ కమిషన్ సభ్యుడు

మల్కాపురం, సెప్టెంబరు 19: హిందుస్థాన్ షిప్‌యార్డును కేంద్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు బొడ్డుపల్లి రామచంద్రరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు షిప్‌యార్డు మెయిన్ గేటు వద్ద దళిత సంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన షిప్‌యార్డులోకి వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆ తర్వాత ఎస్సీ ఎస్టీ సెల్ కార్యాలయంలో కాసేపు పలువురు దళిత ఉద్యోగులు, నాయకులతో మాట్లాడారు. అలాగే షిప్‌యార్డులోని బోర్డు కార్యాలయంలోకి వెళ్లి అక్కడ అధికారులతో సంస్థలో దళితులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. దళితులకు న్యాయబద్ధంగా రావాల్సిన పదోన్నతులు, తదితర అంశాలపై మాట్లాడారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను కమిషన్ పరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. దళితుల హక్కులకు భంగం కలిగించకుండా సంస్థ అధికారులు చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డు ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీల సమస్యలపై వినతిపత్రం అందజేత

విశాఖకు విచ్చేసిన ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచంద్రరావుకు బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను, దళితుల భూములను పలువురు ఆక్రమించిన అంశాలను ఆయనకు వివరించారు.

షెడ్యూల్ ప్రకారం బస్సులు నడపాలని వినతి



గాజువాక డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పులి వెంకటరమణారెడ్డి, తదితరులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 19: ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్స్ నుంచి పెదగంట్యాడ హెచ్‌బీ కాలనీకి రాకపోకలు సాగించే బస్సులను షెడ్యూల్ సమయం ప్రకారం నడపాలని కోరుతూ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి గురువారం గాజువాక డిపో మేనేజర్‌కు వినతపత్రాన్ని అందజేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్-హెచ్‌బీ కాలనీల మధ్య తిరిగే 38డి/హెచ్, రూట్ బస్సులను షెడ్యూల్ సమయానికే నడపాల్సి ఉండగా, ఒకేసారి రెండు, మూడు బస్సులు వచ్చి వెళుతున్నాయని, ఆ తర్వాత గంటన్నర వరకు బస్సులు ఉండక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల ఆయా నంబర్ల బస్సుల షెడ్యూల్‌ను రూపొందించి ప్రజలకు అనుకూలంగా బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. బస్టాప్‌ల వద్ద బస్సుల రాకపోకల సమయాలకు సంబంధించిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అందుకు డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్టు రమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పెంటయ్య, ఎం.అప్పారావు, కె.అప్పలరాజు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి

మండల స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు ప్రారంభం

అగనంపూడి, సెప్టెంబరు 19: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. బాలబాలికల విభాగంలో అండర్ 14, అండర్ 17 జట్ల ఎంపికను చేపట్టారు. ఇందులో మండలంలోని 12 పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత ఎంపిక పోటీలను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఎంఈవోలు దివాకర్, సాయి శైలజ, టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, నాయకులు ఇల్లపు ప్రసాద్, ఎం.మహేశ్, బి.సత్యనారాయణ, చందు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, సెప్టెంబరు 19: పెందుర్తి సబ్‌స్టేషన్ పరిధి సరిపల్లి ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బృందావన్ గార్డెన్, అఖిలేశ్వరి ఆస్పత్రి ఏరియా, ప్రసాద్‌నగర్, జనచైతన్య లేఅవుట్, దొగ్గవానిపాలెం, రైల్వేస్టేషన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందిపుచ్చుకోవాలి

అగనంపూడి, సెప్టెంబరు 19: విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిపుచ్చుకోవాలని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు గురువారం తరగతులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రెక్టార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యా బోధనతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను విజ్ఞాన్ విద్యా సంస్థలు అందిస్తాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, డీన్ ఆఫ్ అడ్మిషన్స్ కె.మధుసూదనరావు, చంద్ర, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు



ప్రిన్సిపాల్ అరుంధతికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

అగనంపూడి, సెప్టెంబరు 19: విజ్ఞాన్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతికి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు వరించింది. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కోంపెటెన్సీస్ (సీఎస్‌సీ) సంస్థ ప్రతినిధులు గురువారం ఆమెను కలిసి అవార్డును అందజేసి అభినందించారు. కళాశాలలో అత్యంత ఉత్తమ బోధనా పద్ధతులు, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మనీంద్ర సాయి, రమేశ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



మహిళకు సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న తపనాచౌదరి

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనాచౌదరి

గాజువాక, సెప్టెంబరు 19: భారతీయ జనతా పార్టీ పాలనతోనే దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనాచౌదరి అన్నారు. 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెం సామాజిక భవనం వద్ద గురువారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశాభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యమన్నారు. బీజేపీ సభ్యత్వాన్ని యువత అధిక సంఖ్యలో తీసుకోవాలని కోరారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు బాటా శ్రీను, కృష్ణంరాజు, అప్పలరాజు, లక్ష్మీనారాయణ, అప్పారావు, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన ప్రజలందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనాచౌదరి, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రలు పేర్కొన్నారు. 59వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ కాలనీలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. బీజేపీలో సభ్యత్వం కోసం 8800202024 సెల్ నంబర్‌కు మిస్డ్ కాల్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బి.నాని, రామ్మోహన్‌రావు, దానేశ్వరరావు, దాడి పురుషోత్తమ్ రమేశ్, సంతోష్‌కుమార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం

ఏరియా ఆస్పత్రిలోని పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది



సూపరింటెండెంట్ రూమ్‌కు సమ్మె నోటీసును అతికిస్తున్న సిబ్బంది

అగనంపూడి, సెప్టెంబరు 19: గత నాలుగు నెలలుగా బకాయి పడిన వేతనాలతో పాటు తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 30 నుంచి సమ్మెకు దిగుతామని అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని పారిశుధ్య, సెక్యూరిటీ, చెదల నివారణ సిబ్బంది స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం సమ్మె నోటీసును ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం గోడకు అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందక తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు కల్పించుకుని కాంట్రాక్టు ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కోన లక్ష్మణ, సంతోశ్, నీలమ్మ, మంగ, చిన్న, పద్మ, కిరణ్‌కుమార్, శ్రావణి, సరోజినీ, సంధ్య, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజం కావాలి: సీఐ దాలిబాబు

పెదగంట్యాడ, సెప్టెంబరు 19: మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కావాలని, దీనికి విద్యార్థులే పునాదులు కావాలని న్యూపోర్టు శాంతిభద్రతల విభాగం సీఐ దాలిబాబు అన్నారు. గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మాదకద్రవ్య వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మెదడు మొద్దుబారుతుందని, ఆలోచనా విధానంలో తేడా వస్తుందని, చివరకు ప్రాణాపాయం కలుగుతుందన్నారు. గంజాయి, కొకైన్, తదితర మాదకద్రవ్యాలను ప్రభుత్వం నిషేధించిందని, అయినా కొందరు అక్రమంగా విక్రయిస్తున్నారని, అలాంటి వారిపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతుందన్నారు. బాలికలు ఎవరికైనా లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తన వంటి ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనకు ఫోన్ చేస్తే తగిన చర్యలు చేపడతామని సీఐ హామీ ఇచ్చారు. ప్రతి వారం ఒక హైస్కూల్ విద్యార్థులతో సమావేశమవుతామన్నారు. ఈ పాఠశాలను తాను దత్తత తీసుకుని, విద్యార్థుల అభ్యున్నతకి, వారి భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పైడిరాజు మృతి టీడీపీకి తీరని లోటు: 'బండారు'



సారిపల్లి పైడిరాజు (ఫైల్)

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 19: మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు సారిపల్లి పైడిరాజు మృతి పార్టీకి తీరని లోటని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడులు విచారం వ్యక్తం చేశారు. 88వ వార్డు వెదుళ్ల నరవలో గురువారం సాయంత్రం పైడిరాజు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో విచ్చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పైడిరాజు పాడెను బండారు అప్పలనాయుడు మోయడంతో ఇది నిజమైన టీడీపీ కార్యకర్తలకు లభించిన అరుదైన గౌరవమని పలువురు పేర్కొన్నారు. అంతిమ యాత్రలో నాయకులు ఉరుకూటి శ్రీనివాస్, గొలగాని సన్యాసిరావు, ఒమ్మి రాము, శివకుమార్, ఎర్నిబాబు, ముమ్మడివరపు రాము, రాజాన పైడిరాజు, చట్టి రాము, తదితరులు పాల్గొన్నారు.

సుసర్ల కాలనీలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 19: జీవీఎంసీ 90వ వార్డు పరిధి సుసర్ల కాలనీ డబుల్ రోడ్డులో వాహనాల వేగ నియంత్రణ నిమిత్తం గురువారం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ రహదారిలో పాఠశాలలు ఉన్నందున వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం, ప్రజల విజ్ఞప్తి మేరకు ఇక్కడ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్టు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరవ పైడిరాజు, రవీందర్‌రెడ్డి, ఏపీఎస్ఈబీ కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నీళ్ల సత్తిబాబు, ఏఈ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద అన్న సమారాధన



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న గొర్లె రామునాయుడు

పెందుర్తి, సెప్టెంబరు 19: వెలంపేటలోని గణేశుని మండపం వద్ద గురువారం నిర్వహించిన అన్న సమారాధనను పీఎసీఎస్ మాజీ చైర్మన్ గొర్లె రాము నాయుడు, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు ప్రారంభించారు. వందలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

మల్కాపురం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీహరిపురం కొరాడ వీధిలో అన్న సమారాధనను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు తనయుడు మౌర్యసింహా ప్రారంభించారు. తొలుత ఆయన గణనాథునికి పూజలు చేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం గవరవీధిలో చగువీర యంగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద చేపట్టిన అన్న సమారాధనను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ ప్రారంభించారు. వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

జోన్-4 జడ్సీగా మల్లయ్యనాయుడు బాధ్యతల స్వీకరణ



అల్లిపురం, సెప్టెంబరు 19: జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్‌గా ఎం.మల్లయ్యనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జడ్సీగా ఉన్న ప్రసాద్ పదోన్నతిపై శ్రీకాకుళం బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన జడ్సీకి జోనల్ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జడ్సీ గతంలో జోన్-5, జోన్-8లలో కమిషనర్‌గా పనిచేశారు.

జోన్ 3 జెడ్సీగా శివప్రసాద్



సీతంపేట, సెప్టెంబరు 19: జీవీఎంసీ జోన్-3 కమిషనర్‌గా కె.శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో యల్లవరంలో విధులు నిర్వహించి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

కేజీహెచ్ ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా మెహర్‌కుమార్

మహారాణిపేట, సెప్టెంబరు 19: కేజీహెచ్ ఇన్‌చార్జ్ సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ మెహర్ కుమార్ నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కేజీహెచ్‌లో కొన్నేళ్లుగా సీఎస్ఆర్ఎంవో పోస్టు ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకు వస్తున్నారు. డాక్టర్ మెహర్ కుమార్‌కు పలువురు వైద్యులు, అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఆర్కేబీచ్‌లో శాంతియుత ర్యాలీ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19: దేశ వ్యాప్తంగా అటవీ ఉద్యమాలకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు క్లీన్ క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధులు ఓఇంద్రిలా, అనిల్ తెలిపారు. అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసంతో అడవులకు ప్రమాదం వాటిల్లుతోందన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అడవులు, జీవవైవిధ్యానికి రక్షణ కోరుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు.



టర్నర్ చౌల్ట్రీ వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు



పూర్ణామార్కెట్‌లోని ఫ్రూట్ మార్కెట్ వద్ద ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర నేతలు

అన్న క్యాంటీన్ల ప్రారంభంతో హర్షాతిరేకాలు

» పేదలకు రూ.5 కే భోజనం వడ్డించిన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 19: తెలుగు దేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరుతో పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు తిరిగి విశాఖలో ప్రారంభించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. గురువారం టర్నర్ చౌల్ట్రీ వద్ద అన్న క్యాంటీన్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలసి ఆయన ప్రారంభించారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకిచ్చిన వాగ్దానాల్లో ప్రధానమైన అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించడం పేద వర్గాలు, కార్మికులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. వైసీపీ హయాంలో అన్న క్యాంటీన్ల సేవలు పేదలకు దూరంచేసి వారి కడుపుకొట్టారన్నారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద అన్నక్యాంటీన్‌లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ పేదలకు ఆహార పదార్థాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, 30వ వార్డు కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, కూటమి శ్రేణులు యజ్ఞశ్రీ, అన్న ఎన్టీఆర్ సేవాసమితి కార్యవర్గ సభ్యుడు గంగాడ గోవింద్, జోన్ 4 కమిషనర్ మల్లయ్యనాయుడు, స్థానిక కూటమి నాయకులు పోలిపల్లి జ్యోతి, ప్రభాకర్, నందమూరి అభిమానులు అప్పలరాజు, వివిధ వార్డులకు చెందిన పార్టీ శ్రేణులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహారాణిపేట: విశాఖ దక్షిణ నియోజకవర్గం కేజీహెచ్, టర్నర్ చౌల్ట్రీ సెంటర్ పూర్ణామార్కెట్ సమీపంలోని ఫ్రూట్ మార్కెట్‌ల వద్ద అన్న క్యాంటీన్లను ఎంపీ శ్రీభరత్, శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ సౌత్ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్‌లు ప్రారంభించారు పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ఎమ్ఎల్ఏ వంశీకృష్ణ మాట్లాడుతూ 5 రూపాయలకే నాణ్యమైన ఆహారం అందించటం గొప్ప విషయమని, పేద ప్రజలకు అవసరమైన చోట ఏర్పాటు చేశామన్నారు. కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్‌లో నేడు ప్రారంభం

అక్కయ్యపాలెం : గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్సార్ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్య నేతలు, వివిధ వార్డుల అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మాతృ మరణాలకు అవకాశమివ్వొద్దు

▸▸ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు



సమీక్షలో సూచనలు చేస్తున్న డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతమ్మధార, సెప్టెంబరు 19: ఇక ముందు మాతృ మరణాలు జరగడానికి వీల్లేదని, ఏఎన్ఎంల నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టం చేశారు. ఎవరైనా గర్భిణులు అస్వస్థతకు గురైనప్పుడు సంబంధిత ఆరోగ్య కార్యకర్తలు ఆమెను వెంటనే డాక్టర్ వద్దకు తీసుకెళ్లి తగిన వైద్యం చేయించాలని ఆదేశించారు. మాతృ మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డాక్టర్ జగదీశ్వరరావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబరులో ఒక మాతృ మరణం సంభవించిందని, బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి చోటు చేసుకున్నట్లు విశ్లేషించారు. ఈ సమావేశంలో డాక్టర్ పూర్ణేంద్ర బాబు, డాక్టర్ ఎస్.జీవన రాణి, డాక్టర్ పి.ఉషా, ఆర్ఎంఎ ఏరియా ఆసుపత్రి (అగనంపూడి) గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, గైనకాలజిస్ట్(కేజీహెచ్) డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వై.మాధురి, డాక్టర్ బి.వర్షిక, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు, బి.నాగేశ్వరరావు, డాక్టర్ రేవతి, మెడికల్ ఆఫీసర్, జి.శారదదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, వి.త్రినాథరావు, వైద్యాధికారులు నాగభూషణం పాల్గొన్నారు.

శస్త్రచికిత్సతో బాలుడికి కొత్త జీవితం



చికిత్స పొందిన బాలుడు చరణ్‌తో వైద్య బృందం

మహారాణిపేట, సెప్టెంబరు 19: మెదడుకు సంబంధించిన అరుదైన వ్యాధితో బాధపడుతున్న 11 ఏళ్ల బాలుడికి వైద్య చికిత్స అందించి కోలుకునేలా చేసింది కేజీహెచ్ వైద్య బృందం. అగనంపూడికి చెందిన చరణ్(11)కు మెదడు బాగా దెబ్బతినడంతో పోస్టీరియర్ ఎన్‌సెఫలోపతి మల్టీసిస్టం ఇన్‌ఫ్లమెటరీ సిండ్రోమ్ వ్యాధికి గురయ్యాడు. ఆకస్మికంగా స్పృహతప్పడం, పట్టుకోల్పోవటం వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. ఖరీదైన వైద్యం అవసరమవడం, బాలుడి తండ్రి అప్పల నాయుడు రోజు కూలీ కావటంతో ఆగసు 31న కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. స్పృహలేని పరిస్థితిలో ఉన్న ఆ బాలుడికి మూడు రోజులు కృత్రిమ శ్వాస (వెంటిలేటరుపై)తో చికిత్స అందించారు. ఆ బాలుడికి ప్రాణాంతక పరిస్థితి వచ్చింది. కేజీహెచ్‌లో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చక్రవర్తి, డా.రత్నకుమారి, డా.సునీల్, డా.వాసు, డా.బంగారు, డా.కావ్య తదితర వైద్య బృందం బాలుడికి చికిత్స అందించింది. 21 రోజులు అందించిన చికిత్సతో బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. గురువారం డిశ్చార్జు అయ్యాడు. ఇదే చికిత్స ప్రైవేటు ఆసుపత్రిలో అయితే సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. కాని కేజీహెచ్‌లో ఉచితంగా వైద్య సేవలందించడంతో బాలుడి కుటుంబానికి ఊరట కలిగింది.

కొబ్బరితోటలో క్రేజీ అన్నదానం



కొబ్బరితోటలో భోజనాలు ఆరగిస్తున్న మహిళలు

అల్లిపురం, సెప్టెంబరు 19: వినాయక చవితి వేడుకల్లో భాగంగా జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోటలో గురువారం క్రేజీ అన్నదానం జరిగింది. క్రేజీబాయిస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం 20 వంటకాలతో భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి టిఫిన్లతో హోరెత్తించారు. సుమారు 2 వేల మందికి 2 లీటర్ల పరిమాణం గల శీతల పానీయాలు, మిఠాయిలు, బిరియానీలతో భోజనం పెట్టడంతో ప్రజలు ఎగబడ్డారు.

మర్రిపాలెం: గ్రేటర్ పరిధి 54వ వార్డు మర్రిపాలెం జ్యోతినగర్‌లో గురువారం అన్నసమారాధాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్‌కుట్టా పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. పరిసర కాలనీల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు దినేష్‌రెడ్డి, ప్రభాకర్, నాని, రాజేష్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనులు

▸▸ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్



వైద్యశిబిరంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ తదితరులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 19: అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వార్డులో అభివృద్ధి పనులు జరిగేలా చూస్తానని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ అన్నారు. గురువారం వార్డులో పూర్ణిమా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, దక్షిణ నియోజకవర్గం నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ, కోడిగుడ్ల శ్రీధర్‌లు ప్రారంభించారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు బీజేపీ అధ్యక్షుడు వంకా సంజీవ్, గంగారాం మాస్టర్, వెలంగిణిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు తీరం రక్షణకు 2 వేల కోట్లు

» ఏపీలో కోత నివారణకు 'షోర్' అమలుకు ప్రతిపాదనలు
» భీమిలి, విశాఖ కురుసుర, ఉప్పాడల్లో ప్రమాదకర స్థాయిల్లో తీరం కోత
» నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణమూర్తి



విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తీరం కోత నివారణకు రూ.2,000 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో 'షోర్' ప్రాజెక్టు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణమూర్తి వెల్లడించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. 'తీరం కోత నివారణకు తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో షోర్ ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. తూర్పు తీరంలో ఉన్న ఒడిశా ప్రభుత్వం కూడా ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఐదేళ్ల కాలపరిమితితో కూడిన ఈ ప్రాజెక్టు అమలు చేస్తే కోత నివారణ చాలావరకు అదుపులోకి తీసుకురావచ్చు. కోస్తాలో ఇచ్ఛాపురం నుంచి తడ వరకు సముద్ర కోతపై ఇప్పటికే మా సంస్థ అధ్యయనం చేసి నివేదిక విడుదల చేసింది. తీరం వెంబడి కృష్ణపట్నం, గోదావరి, కృష్ణా నదులు కలిసే ప్రాంతాలు, కాకినాడ సమీపంలోని ఉప్పాడ, విశాఖలో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, భీమిలి వద్ద కోత ఆందోళనకరంగా ఉందని గుర్తించాం. ప్రస్తుతం కోత తీవ్రంగా ఉన్న చోట్ల, భవిష్యత్తులో సమస్య ఎదుర్కొనే ప్రాంతాలు... ప్రధానంగా బురద, ఇసుక కలిసి ఉన్న ప్రదేశాల్లో మడ అడవులు పెంపకం ద్వారా తీరాన్ని కోత నుంచి రక్షించవచ్చు. తీరం భారీగా కోతకు గురయ్యే చోట్ల రక్షణ గోడలు నిర్మించడం, డ్రెడ్జింగ్ ద్వారా బీచ్‌లు ఏర్పాటు, సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న వర్గాలకు జీవనోపాధి కల్పించడం వంటివి ప్రతిపాదనల్లో పొందుపరిచాం. ఉప్పాడ సమీపంలో సుమారు 13 కి.మీ. పొడవునా తీరం తీవ్ర ఒత్తిడికి గురై భారీ కోతకు గురవుతుందని గుర్తించాం. శాశ్వత ప్రాతిపదికన ఉప్పాడ తీరంలో కోత నివారణకు రూ.250 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇప్పటికే తీరం వెంబడి ఉన్న రక్షణ గోడను మరింత పటిష్ఠం చేయడం, ఉప్పాడకు ఉత్తరాన ఉన్న ఫిషింగ్ హార్బర్ వద్ద కోత నివారణకు మడ అడవులు పెంపకం, ఇసుక తిన్నెల రక్షణ వంటి చర్యలు తీసుకుంటాం. ఏపీ కోస్తా మెరైన్ స్పెషల్ ప్లాన్ పేరిట మరో అధ్యయనం చేస్తున్నాం. మన సముద్ర జలాల్లో ఖనిజాలు, మెరైన్ సంపద వెలికితీత, అధ్యయనం కోసం ప్రత్యేకించి వెసల్ ఏర్పాటు, తుఫాన్ల తీవ్రతను గుర్తించడం, సముద్రంలో విద్యుత్ ఉత్పత్తి, అవసరమైన ప్రాంతాల్లో సముద్ర నీటిని శుద్ధి చేయడం వంటి అంశాలపై 'డీప్ ఓషన్ మిషన్' ప్రాజెక్టు ప్రస్తుతం అమలు చేస్తున్నాం. దేశానికి కొరతగా ఉన్న కాపర్, కోబాల్ట్, ఇతర విలువైన ఖనిజాలు, ఎంతో విలువైన బయో డైవర్సిటీ ఉన్న మాలిక్యూల్ వెలికితీతపై పరిశోధనలు చేస్తున్నాం. ఐదేళ్ల కాలపరిమితితో మూడేళ్ల క్రితం ప్రారంభమైన మిషన్ మరిన్ని పరిశోధనల కోసం కేంద్రం గడువు పెంచే అవకాశం ఉంది' అని రమణమూర్తి అన్నారు.

పేదోడికి పట్టెడన్నం

... 3వ పేజీ తరువాయి

గురువారం కంచరపాలెం వెళ్లి ఈ వంటలు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. అధునాతన పరికరాలను ఉపయోగించి, నాణ్యమైన దినుసులతో వంటకాలు తయారుచేస్తున్న విధానాన్ని ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ భక్తదాస వివరించగా సంతృప్తి వ్యక్తంచేశారు. ఇక్కడి నుంచి వచ్చిన వంటకాలను అన్న క్యాంటీన్ల ద్వారా ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు ప్రజలకు వడ్డించారు. ప్రారంభం రోజు కావడంతో ఉచితంగానే భోజనాలు పెట్టారు. శుక్రవారం నుంచి డబ్బులు తీసుకొని వడ్డిస్తారు. ప్రతి ఆదివారం వీటికి సెలవు.

ఉక్కుకు 500 కోట్లు

... 3వ పేజీ తరువాయి

లక్ష టన్నుల బొగ్గును నౌకలో తెప్పించుకోవాలంటే... రూ.500 కోట్లు అవసరమని, ఇప్పుడు మంత్రిత్వ శాఖ ఇచ్చే నిధులతో ఏమీ కొనలేమని వాపోతున్నారు. రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్ తయారు చేయగల రూ.30 వేల కోట్ల విలువైన యంత్ర పరికరాలు వృథాగా ఉన్నాయని, వాటిని నడిపించాలనే తాము కోరుతున్నామని అంటున్నారు. ప్రైవేటు స్టీల్‌ప్లాంట్లు లాభాల్లో ఉంటే..విశాఖ స్టీల్ ఎందుకు నష్టాల్లో ఉందో ఆలోచించాలని మంత్రులు అంటున్నారని, గత మూడేళ్ల నుంచి ఈ స్టీల్‌ప్లాంటును ఢిల్లీ నుంచి కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖే నడుపుతోందని, ఈ మూడేళ్లలో జరిగిన దానికి వారే బాధ్యత వహించాలని, ఇక్కడి ఉద్యోగులు, కార్మికులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారని, అందుకే పోరాట బాట పట్టామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వాలని, లేదంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇకనైనా కదులుతారా!?

... 3వ పేజీ తరువాయి

అడ్డం పడ్డారో... తెలియదు గానీ తూతూమంత్రంగా కూల్చివేత పనులు జరిగాయి. ఈ విషయం కూడా హైకోర్టు దృష్టికి వెళ్లడంతో తాజాగా బుధవారం చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. నిర్మాణాలన్నీ వెంటనే కూల్చివేసి ఈ నెల 25వ తేదీ వాయిదా నాటికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

ఆ నిర్మాణాలన్నీ సీఆర్‌జెడ్-1లోనే...

భీమిలి బీచ్‌లో సీఆర్‌జెడ్-2లోనే నిర్మాణాలు చేపట్టామని, సీఆర్‌జెడ్-1లో కాదని నేహారెడ్డి తరఫు న్యాయవాదులు వాదించారు. కానీ న్యాయమూర్తి కోర్టుకు సమర్పించిన వీడియోలు, ఫొటోలు చూపించి, ఆ నిర్మాణాలన్నీ హైటైడ్ ప్రాంతం..అంటే తీరానికి 200 మీటర్ల లోపే..సీఆర్‌జెడ్-1లోనే ఉన్నాయని, కూల్చివేయాలని ఆదేశించారు.

నోటీసుకు సమాధానం లేదు

అనుమతులు లేని నిర్మాణాలు కూల్చివేయాలని కోర్టు ఆదేశిస్తే కేవలం ఒకవైపు ప్రహరీ గోడ పైపైన తొలగించిన జీవీఎంసీ అధికారులు...ఆ భూమిలో అప్పటికే ఉన్న పాత నిర్మాణాలకు అప్పట్లో తీసుకున్న అనుమతులు, కొత్త వాటికి తీసుకున్నామని చెబుతున్న అనుమతులు, ఆ భూములపై హక్కు పత్రాలు సమర్పించాలని మూడు రోజుల వ్యవధితో నోటీసు ఇచ్చారు. పది రోజులైనా దానిపై ఇంతవరకూ సమాధానం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు మరోమాటకు తావు లేకుండా హైకోర్టు ఆదేశాలతో అక్కడి నిర్మాణాలన్నీ కూల్చివేయవచ్చు. ఏమి చేస్తారో చూడాలి. ఇప్పుడు కూడా కూటమి నేతలు ఫోన్లు చేసి అడ్డం పడతారా?, లేక జీవీఎంసీలో 'సాయి భక్తులు' తూతూ మంత్రపు పనులు చేస్తే ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఊరుకుంటారా? చూడాలి.

తీరం కోతకు చెక్

... 3వ పేజీ తరువాయి

పదేళ్ల క్రితం రెండు పర్యాయాలు అక్కడ బీచ్‌రోడ్డు కోతకు గురైంది. కోత నివారణకు భారీగా బండరాళ్లు వేస్తే కురుసురకు ఉత్తరాన కోత మొదలైంది. ఈ నేపథ్యంలో కురుసుర వెనుక తీరంలో ఒక నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. తీరం నుంచి సముద్రంలోకి నీటి మట్టానికి మూడు మీటర్ల లోతున 120 మీటర్ల పొడవు, 20 నుంచి 30 మీటర్ల వెడల్పుతో సిమెంట్, కాంక్రీట్, స్టీల్‌తో ఒక నిర్మాణం చేపడతారు. దీనివల్ల అలల తీవ్రత తగ్గుతుంది. అదే సమయంలో సముద్రం నుంచి ఇసుక మేటగా వచ్చి బీచ్‌లో చేరుతుంది. ఇప్పటికే పుదుచ్చేరిలో అటువంటి నిర్మాణం చేపట్టగా కోత తగ్గింది. ఇక ఆర్కే బీచ్‌లో కోత తీవ్రంగా ఉన్నప్పటికీ అక్కడ సహజసిద్ధంగా ఉన్న రాళ్లతో బీచ్ సురక్షితంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే తరహాలో కురుసుర వద్ద అలల వేగం తగ్గించగలిగితే కోతకు అడ్డుకట్ట వేయవచ్చునని అంచనాకు వచ్చారు.

భీమిలి మునిసిపల్ కార్యాలయం వద్ద కోత నివారణకు చర్యలు

భీమిలి మునిసిపల్ కార్యాలయం వద్ద కోత ఎక్కువగా ఉందని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థ గుర్తించింది. అక్కడ కూడా కోత నివారణకు చర్యలు తీసుకుంటామని ఈ సంస్థ డైరెక్టర్ ఎంవీ రమణమూర్తి వెల్లడించారు. ఇంకా ఫిషింగ్ హార్బర్‌కు ఉత్తరాన, భీమిలి వరకూ ఇంకా పలుచోట్ల కోత ఉన్నట్టు తమ పరిశోధనలో వెల్లడైందని, దశలవారీగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు తీరంలో కోతపై ఇప్పటికే తాము అధ్యయనం చేసినందున కోత నివారణకు వీఎంఆర్‌డీఏతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.

వన్‌టౌన్‌లో మళ్లీ కొళాయి నీటి సరఫరా బంద్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 19: వన్‌టౌన్ ప్రజానీకాన్ని నీటి సమస్య వెంటాడుతోంది. జీవీఎంసీ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారినా చక్కదిద్దే నాథుడు లేడు. గురువారం 30వ వార్డు నుంచి పాతపోస్టాఫీసు 39వ వార్డు వరకు కుళాయి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు కొళాయిల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. ముందస్తు సమాచారం లేకుండా కొళాయి నీటి సరఫరాను నిలిపివేయడం దారుణమని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయకపోవడం పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటిని సక్రమంగా సరఫరా చేయాలంటున్నారు.

వీటీ హైస్కూల్ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు

సీతంపేట, సెప్టెంబరు 19: సీతంపేట రాజేంద్రనగర్‌లోని వి.టి. హైస్కూల్‌లో నెలవారీ ఫీజు చెల్లించలేదని విద్యార్థులను యూనిట్ పరీక్షలు రాయకుండా నలభై నిమిషాల పాటు తరగతి గది బయట నిలబెట్టారు. ఈ విషయం తెలుసుకుని వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులపై స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయ యాజమాన్యం తిరగబడి కేకలు వేశారు. మీసాల ఆదినారాయణ ఇద్దరు పిల్లలు ఈ స్కూల్‌లో చదువుతున్నారు. వీరిలో ఒకరి నెలవారీ ఫీజు చెల్లించలేదు. దీంతో ఈ నెల 18న ఆ విద్యార్థినికి యూనిట్ పరీక్ష రాయించకుండా 40 నిమిషాల పాటు తరగతి గది బయటనే నిలబెట్టారు. ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలిపి మనోవేదనకు గురైంది. దీంతో గురువారం ఆదినారాయణ తన భార్యతో కలిసి స్కూల్‌కి వచ్చాడు. ఫీజు కొద్ది రోజుల్లో చెల్లిస్తామని కరస్పాండెంట్ రమణకు తెలిపారు. దీంతో తమ దంపతులపై దురుసుగా వ్యవహరించి బయటకు పొమ్మన్నారని ఆరోపించారు. దీంతో ఆదినారాయణ ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు స్కూల్ ప్రతినిధులను స్టేషన్‌కి పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి ఇకపై ఫీజుల విషయంలో ఒత్తిడి చేయరాదని సూచించి బైండోవర్ రాయించి పంపివేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కంచరపాలెం, సెప్టెంబరు 19: కంచరపాలెం దరి ఐటీఐ జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలో నివాసముంటున్న ఎస్.సంతోష్ కుమార్ (28) రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూంలో విధులు నిర్వహిస్తున్నాడు. సంతోష్ కుమార్ గురువారం ఉదయం 10 గంటల సమయంలో మెట్టు నుంచి ఐటీఐ జంక్షన్‌కు వెళ్తుండగా ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించబోయి అదుపు తప్పి బస్సు కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే సంతోష్‌కుమార్ మృతిచెందాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఏఎస్ఐ కె.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగడాలు శ్రుతిమించితే ఫిర్యాదు చేయండి

▸▸ ఆకతాయిల చేష్టలపై ప్రజలకు కార్పొరేటర్, సీఐ సూచన



ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, కార్పొరేటర్

అల్లిపురం, సెప్టెంబరు 19: ఆకతాయిల ఆగడాలు ఉపేక్షించేది లేదని 32వవార్డు కార్పొరేటర్, జనసేన నాయకులు కందుల నాగరాజు అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం టూటౌన్ సీఐ తిరుమలరావుతో కలసి చలువతోట, ఎల్లపువారి వీధి, నేరెళ్ల కోనేరు, ఎస్ఆర్ఎంటీ ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ శృతి మించితే వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో కందుల కృష్ణ,సీపీఐ బుజ్జి, ఆదిబాబు, కందుల బద్రినాథ్, కేదారనాథ్‌లు పాల్గొన్నారు.

జోన్ వన్ జడ్సీగా ప్రేమ ప్రసన్న వాణి

భీమునిపట్నం, సెప్టెంబరు 19 : భీమిలి జోనల్ కమిషనర్‌గా (జోన్-1) పి. ప్రేమ ప్రసన్న వాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కనక మహాలక్ష్మిని కమిషనర్, డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కార్యాలయంలో రిపోర్టు చేయమని ఆదేశాలు రాగా ఆమె స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రసన్నవాణి ఇక్కడికి బదిలీయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయం అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

జోన్ 2 జడ్సీగా సింహాచలం

కొమ్మాది : జీవీఎంసీ జోన్-2 కమిషనర్‌గా పొందూరు సింహాచలం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఆయన గాజువాక, జ్ఞానాపురం, పెందుర్తిలో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జాతర గుట్ట దుర్గాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువతో సత్కరించారు.

సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు

సిరిపురం, సెప్టెంబరు 19 : సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపును ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించినట్టు ఈవో కె.శిరీష తెలిపారు. గత 14 రోజులకు గాను రూ.16,00,669 నగదు, బంగారం 8.210 మిల్లీ గ్రాములు, వెండి 90 గ్రాములు, యూఎస్ఏ డాలర్లు 22, చెక్కు 999 వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్, జి. గోవిందరెడ్డి, శివజ్యోతి, వేంకటేశ్వరసేవా సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులుగా ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో సుదర్శన యాగం

ఆరిలోవ, సెప్టెంబరు 19 : ఆరిలోవలోని ఎర్ని దుర్గమాంబ ఆలయ ఆవరణలో గురువారం సుదర్శన యాగం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజయ్యారు. ముందుగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు జరిపారు. అనంతరం బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఒమ్మి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో భీమిలి విద్యార్థినికి బంగారు పతకం

భీమునిపట్నం, సెప్టెంబరు 19 : పట్టణంలోని ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి చదువుతున్న వెంపాడ కుస్మిత జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈమేరకు పాఠశాల కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. హరియాణాలోని రోహటక్‌లో ఈనెల 7న జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఈ ఘనత సాధించినట్టు చెప్పారు.

కుట్టు శిక్షణతో ఆర్థికాభివృద్ధి

భీమునిపట్నం, సెప్టెంబరు 19 : పట్టణానికి చెందిన కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆ సంస్థ కార్యాలయంలో మహిళలకు గురువారం నుంచి కుట్టు శిక్షణను ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణ పొందడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇది పదో బ్యాచ్ అని చెప్పారు. ఇప్పటివరకు 45 మంది శిక్షణలో చేరారని, ఆసక్తి కలిగిన వారు 9643222666 సెల్ నంబరును సంప్రతించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పద్మనాభం కేజీబీవీ బాలిక ఎంపిక

పద్మనాభం, సెప్టెంబరు 19 : పద్మనాభం కేజీబీవీ విద్యాలయానికి చెందిన బాలిక రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న ఏ. తనూజ ఏయూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. బాలికను డీఈఓ చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు అభినందించారని ఆమె చెప్పారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 52, టమాటా 40, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 24, క్యారెట్ 36, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 110, బరబటి 44, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్రాయిగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10 లో..



మారికవలస అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



చిన వాల్తేరులో మానసిక ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను టీడీపీ కార్యకర్తతో ప్రారంభింపజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

- అన్న క్యాంటీన్లలో రూ. 5 కే రుచికరమైన భోజనం
- పునఃప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి

పెదవాల్తేరు/కొమ్మాది/ఆరిలోవ, సెప్టెంబరు 19 : పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల ప్రధాన లక్ష్యమని భీమిలి, తూర్పు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం వారు కొమ్మాది, పెదవాల్తేరు, ఆరిలోవలో పలు చోట్ల అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించినట్టు తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ల వల్ల ఎంతోమంది పేదల ఆకలి తీరేదని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటిని తొలగించిన విషయం తెలిసిందేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్యాంటీన్లను పునఃప్రారంభించామని చెప్పారు. పేదలకు రూ. 5 కే రుచికరమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. కాగా 20వ వార్డు చినవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రి దారిలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఎమ్మెల్యే వెలగపూడి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, కార్పొరేటర్ నొల్లి నూకరత్న, బైరెడ్డి పోతన్నరెడ్డి, పీతల అమరేంద్ర, బొట్టా వెంకట రమణ, పీతల అవినాష్, సీహెచ్ జ్యోతి, పల్లా ఉమా రాణి పాల్గొన్నారు. కొమ్మాదిలోని మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఎమ్మెల్యు గంటా ప్రారంభించారు. కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, జోన్ - 2 ఈఈ శాంతిరాజు, ఏసీపీ శాస్త్రి, టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి శ్రీనివాస్, బోయి రమాదేవి, నాగోతి వెంకట సత్యనారాయణ, మన్యాల సోంబాబు పాల్గొన్నారు. అలాగే ఆరిలోవలోని బీఆర్‌టీఎస్ రోడ్డు, సంజయ్ గాంధీ కాలనీలో ఏర్పాటు చేసిన రెండు క్యాంటీన్‌లను ఎమ్మెల్యే వెలగపూడి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఒమ్మి సన్యాసిరావు, గోవింద,అచ్చుతరావు, పోలారావు, రాజారావు, ధర్మారావు, సురేష్, మజ్జి రమణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : టీడీపీ పేదల పక్షపాతి అని మరోసారి రుజువైందని ఎమ్మెల్యే వెలగపూడి అన్నారు. ఎంవీపీ కాలనీ రైతు బజారు వద్ద సచివాలయ భవనాన్ని ఆధునీకరించి అన్న క్యాంటీన్‌గా మార్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన దీన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరిధిందర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, టీడీపీ నాయకులు చోడె పట్టాభిరాం, ఒమ్మి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమిలిలో ప్రారంభం

భీమునిపట్నం : పట్టణంలోని చిన్నబజారు మేదర వీధిలో పునర్నిర్మించిన అన్న క్యాంటీన్ శుక్రవారం ప్రారంభం కానుంది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నూకరాజు తెలిపారు.

కూటమి వంద రోజుల పాలనపై ప్రజల్లోకి : ఎమ్మెల్యే వెలగపూడి



నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 19 : ఇది మంచి ప్రభుత్వం పేరిట శుక్రవారం నుంచి అధికారులు, సిబ్బందితో పాటు నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. గురువారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి, వంద రోజులు పూర్తయిన సందర్భంగా వార్డుల్లో పాదయాత్రలు నిర్వహించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలను తెలుసుకోవడం,త్వరలో రాబోతున్న కొత్త పథకాలు, ప్రభుత్వం పనితీరుపై ఫీడ్ బ్యాక్ వంటి అంశాలు ఇందులో ఉంటాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సమస్యలపై పోరాటాలు చేశామని, ఇప్పుడు అధికారంలో ఉన్నా, ప్రజల్లోనే ఉన్నామన్న నమ్మకం ప్రజల్లో కలగాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి 26వతేదీ వరకూ పాదయాత్రలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్, కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, నొల్లి నూకరత్నం, మాజీ కార్పొరేటరు ఒమ్మి సన్యాసిరావు, పోతన్న రెడ్డి, బొట్ట రమణ పాల్గొన్నారు.

15వ వార్డులో సంబరాలు

వెంకోజీపాలెం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా 15వ వార్డులోని టీడీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు సత్యనారాయణ, రవికుమార్, మహేష్, గౌరీ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ కోఆపరేటివ్ సొసైటీ అభివృద్ధికి సహకారం

మధురవాడ, సెప్టెంబరు 19 : మధురవాడ కోఆపరేటివ్ సొసైటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మధురవాడలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషద కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన మధురవాడ సొసైటీని అభివృద్ధి చేయడానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పూర్వ ఉపాధ్యక్షుడు మరుపిళ్ళ పైడిరాజు, 7,8వ వార్డుల కార్పొరేటర్లు పిళ్లా మంగమ్మ, లడగల అప్పారావు, నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన ఎల్లం నాయుడు, వాండ్రాసి అప్పలరాజు, పోతిన ప్రసాద్, పిళ్లా వెంకటరావు, సియ్యాద్రి పైడితల్లి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ముల్లు అప్పలరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మన్యాల రమేష్‌బాబు, డివిజనల్ సహకార శాఖాధికారి దుర్గాప్రసాద్, వర్మ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 19 : అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. 8వ వార్డు బీజేపీ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బీజేవైఎం స్టేట్ సెక్రటరీ మాధవ్, వార్డు జనరల్ సెక్రటరీ గరికిన ఎల్లాజీ, వైస్ ప్రెసిడెంట్ రఘు చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం తహసీల్దార్ కార్యాలయానికి బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటాన్ని బహూకరించారు. మోదీ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవంలో భాగంగా ఈ ఫొటో బహూకరణతో పాటు ప్రజలకు సేవలందిస్తున్న తహసీల్దారు ఆనందకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ ఏపీ మెడికల్ విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, బీజేపీ నాయకులు శ్రీనివాసరావు, కృష్ణారావు, మహేష్, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, కార్యదర్శి ప్రసాద్, ఎన్ఆర్‌పేట సర్పంచ్ సూర్యనారాయణ, మజ్జిపేట ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలు విభాగాలను తనిఖీ చేసిన ఏయూ వీసీ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19 : ఏయూ ఆర్ట్స్ కళాశాల పరిధిలోని పలు విభాగాలను వీసీ ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నర సింహారావుతో కలిసి సోషల్ సైన్సెస్ భవనం లోని సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం విభాగాలను పరిశీలించారు. తరగతులు జరుగుతున్న విధానం, హాజరు పట్టికలను చూశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీమన్నారాయణ, తది తరులు పాల్గొన్నారు.అలాగే ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాలను కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరు, తరగతుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు, అకడమిక్ డీన్ ఆచార్య ఈశ్వర్‌కుమార్, పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

నగర పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు గురువారం విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఘనంగా తాపీ ధర్మారావు జయంతి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19 : ఏయూ తెలుగు విభాగంలో ప్రముఖ రచయిత తాపీ ధర్మారావు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా పలువురు తాపీ ధర్మారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ సమాజం నిత్యం స్మరించుకోదగ్గ గొప్ప వ్యక్తి ధర్మారావు అన్నారు. అనేక రచనలు చేసి సమాజాన్ని చైతన్యం చేసిన నిత్య పరిశీలన శీలి,తన జీవితాన్ని సమాజం కోసం త్యాగం చేసిన ధన్యజీవి ధర్మారావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అరుణ్‌కుమార్, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

తగరపువలస, సెప్టెంబరు 19 : స్వచ్ఛతా సేవా కార్యక్రమాల్లో భాగంగా బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు మన పాఠశాల, మన ఇల్లు, మన ఊరు వంటి వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పెదవాల్తేరు, సెప్టెంబరు 19 : ఆర్‌టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఎన్ఎంయూ నాయకులు వినతిపత్రం అందించారు. గురువారం వారు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీపీటీఓ వైఖరిపై నలభై రోజులుగా వాల్తేరు డిపోలో నిరసనలు చేపడుతున్నా.. యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. డీపీటీవో తీరు వల్ల సంస్థకు నష్టాలు వస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు గండి రామకృష్ణ, బి. నీలకంఠం, డివిజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, వాల్తేరు డిపో అధ్యక్షుడు రాయపాటి వసంతరావు, పీజీ పతి, గాజువాక డిపో కార్యదర్శి పళ్లా శంకరరావు, మద్దిలపాలెం డిపో అధ్యక్ష, కార్యదర్శులు, చిన్నా, ఈశ్వరరావు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ రావు పాల్గొన్నారు.

నార్త్ జోన్ ఏసీపీగా అప్పలరాజు

ఎండాడ, సెప్టెంబరు 19 : పీఎం పాలెం పోలీసుస్టేషన్ ఆవరణలో ఉన్న నార్త్ జోన్ కార్యాలయంలో ఏసీపీగా ఎస్.అప్పలరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన పీఎంపాలెం స్టేషన్ సీఐగా, అనకాపల్లి డీఎస్పీగా కూడా పని చేశారు. ఎస్ఐ క్యాడర్ నుంచి అంచెలంచెలుగా ఎదిగారు.

నెహ్రూ బజార్‌లో అన్నదానం



కార్యక్రమంలో పాల్గొన్న కంచెర్ల

ఆరిలోవ, సెప్టెంబరు 19 : నెహ్రూ బజార్‌లో కంచెర్ల యువసేన ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఉపకార ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత, ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కంచెర్ల అచ్యుతరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా 3000 మంది స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు జనసేన అధ్యక్షుడు పొట్టి అప్పారావు, ఉపకార ట్రస్ట్ సమన్వయకర్త సుధీర్ చెన్నతి, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆరో వార్డు పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో అన్నదానం నిర్వహిం చారు. టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ ప్రాంభించిన ఈ కార్యక్రమంలో ఆరో వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు గోశాల లేఅవుట్ సింహగిరి నిర్వాసితుల కాలనీలో గణపతి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన జరిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, అడివివరం పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, అడివివరం సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, కాలనీకి చెందిన పట్నాల ధర్మరాజు, తాలాడ రామారావు, పండూరి మురళీ పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

భీమునిపట్నం, సెప్టెంబరు 19 : పట్టణంలోని నేరెళ్లవలస కాలనీలో ఉన్న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. బిడేటా టెక్నాలజీస్ వారి యూఎస్ ఐటీ రిక్రూటర్, వెబ్ డెవలపర్స్, బెంచ్ స్కేల్ రిక్రూటర్ పోస్టులు, ట్రెంట్ లిమిటెడ్ (ఏ టాటా ఎంటర్‌ప్రైజస్) అసోసియేట్స్, హెచ్‌ఆర్ అండ్ అకౌంటెంట్ ఆఫీసర్ పోస్టులు, ఫ్లూఎంట్ గ్రిడ్ లిమిటెడ్‌లో ఇన్‌స్టాలర్, జూనియర్ ఇంజనీర్, ఫీల్డ్ సూపర్‌వైజర్, హెల్పర్ పోస్టులు, అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్, ఫార్మసీ ట్రైనీ పోస్టులకు సంబంధించి జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు 9014758949 నంబర్‌ను సంప్రతించాలన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, సెప్టెంబరు 19 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకవేదికపై ఉంచారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు పసిడి కుసుమాలతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వైదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత : డీఈఓ



ర్యాలీ చేస్తున్న తోటగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ, సెప్టెంబరు 19 : ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అని డీఈఓ ఎల్. చంద్రకళ అన్నారు. గురువారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓజోన్ పొరను పరిరక్షించాలని కోరుతూ ర్యాలీ చేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవావరణానికి రక్షణ కవచంలా ఉన్న ఓజోన్ పొర మానవ తప్పిదాల వల్ల నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భూమిపై ఉన్న సకల జీవరాశి మనుగడకు ప్రమాదమని హెచ్చరించారు. ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిపి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షాభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రామకృష్ణ, ఏపీ కాస్ట్ జిల్లా సమన్వయకర్త పి. రాజారావు, స్కూల్ కమిటీ చైర్మన్ జాన్ ప్రసాద్, రవి, అనురాధ పాల్గొన్నారు.

వైద్య సీట్లు భర్తీ చేయాలని ధర్నా



కృష్ణ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 19 : కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు కేటాయించిన సీట్లను భర్తీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి. లక్ష్మీ డిమాండ్ చేశారు. వైఎస్సార్ వైద్య కళాశాల అనుమతిని రద్దు చేయాలని రాష్ట్ర మెడికల్ కమిషన్ డైరక్టరేట్ ఎన్ఎంసీకి రాసిన లేఖను ఖండిస్తూ గురువారం పీడీఎస్‌వో ఆధ్వర్యంలో విద్యార్థులు కృష్ణ కళాశాల వద్ద ధర్నా చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు వల్ల అందరికీ వైద్య విద్య అందే అవకాశం కలుగుతుందని ప్రజలు భావించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అయిదు కళాశాలలకు అనుమతి కోరగా జాతీయ మెడికల్ కమిషన్ రెండు కళాశాలల్లో 50 సీట్లకు అనుమతి కల్పించిందన్నారు. కొత్త కళాశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో అడ్మిషన్లు చేయలేమని ప్రభుత్వం ఎన్ఎంసీకి లేఖ రాయడం దారుణమని చెప్పారు. కొత్త కళాశాలల్లో వసతులు కల్పించి అడ్మిషన్లు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సాయికుమార్, చందు, సురేష్, యమున, నాగశ్రీ, కుమార్ పాల్గొన్నారు.

చినగదిలి సాయిబాబా ఆలయంలో పూజలు

ఆరిలోవ, సెప్టెంబరు 19 : చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ రేలంగి సోమన్నారాయణ గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ట్రస్టు చైర్మన్ వానపల్లి అప్పారావు, కార్యదర్శి ఆర్‌పి పాత్రో ఆయనకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ అదనపు కమిషనర్ రేలంగి సోమన్నారాయణ 20 ఏళ్ల పాటు ఆలయ గౌరవ అధ్యక్షుడిగా ఉండి, గుడి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.

'భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి'

కొమ్మాది, సెప్టెంబరు 19 : ఇసుక ధర విపరీతంగా పెరగడంతో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ అనుబంధ సంస్థ త్రిశక్తి భవననిర్మాణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గురువారం వారు కొమ్మాది కూడలి లేబర్ బజారు వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. రాజశేఖర్, నాయకులు వెంకటేష్, పి. ఈశ్వరరావు, పి. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 19 : పద్మనాభం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పద్మనాభం పంచాయతీ పరిధిలోని పద్మనాభం, ఇసకలపాలెం, రేవిడి ఫీడర్ పరిధిలో రేవిడి. బర్లపేట, పాండ్రంగి, కొండ బర్లపేట, పాండ్రంగికు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

గ్రామాల్లో పంటల నమోదు పరిశీలన

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 19 : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే ప్రతి రైతు ఈనెల 23లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ ఎంవీ చలం తెలిపారు. గురువారం ఆయన పద్మనాభం, ఇసకలపాలెం, మద్ది గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ రాయితీలు అందాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు 6239 ఎకరాలకు గాను 5905 ఎకరాలకు పంటల నమోదు జరిగిందన్నారు.

విమానాశ్రయానికి 'అల్లూరి' పేరు పట్ల హర్షం

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 19 : భోగాపురం విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు పేరు పెట్టడం పట్ల ఏపీ క్షత్రియ ఫెడరేషన్ చైర్మన్ చెరుకూరి వెంకటపతిరాజు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టాలని ప్రతిపక్ష నేతగా ఉన్న సమయం లో చంద్రబాబును కలిసి విన్నవించామని, అధికారంలోకి రాగానే అమలు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈమేరకు మంత్రివర్గ సమావేశంలో భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరును తీర్మానించడం హర్షణీయమని చెప్పారు.

సఫాయి మిత్ర కార్మికుల సంక్షేమానికి కృషి : కేంద్రమంతి



కార్మికులకు జేసీబీలు, పీపీఓ కిట్లు అందిస్తున్న మంత్రి వీరేంద్రకుమార్

ఎంవీపీ కాలనీ/పెదవాల్తేరు, సెప్టెంబరు 19 : ఎంవీపీ కాలనీలోని లెబెన్స్ హిల్ఫే మానసిక దివ్యాంగుల పాఠశాలను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ గురువారం సందర్శించారు. పాఠశాల డైరెక్టర్ లక్ష్మీ సూర్యశ్రీ పాఠశాలకు సంబంధించిన అంశాలను మంత్రికి వివరించారు. అనంతరం లాసన్స్‌బే కాలనీలోని ఎం.ఎస్.ఎఫ్- 3లో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన సఫాయి మిత్ర కార్మికులకు జేసీబీలు, పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సఫాయి మిత్ర కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్మికులు భూగర్భ డ్రైనేజీలో దిగి ప్రాణాలు కోల్పోవలసి వస్తుందని, వారు మ్యాన్‌హోల్‌లో దిగకుండా ప్రత్యేకమైన రెండు జేసీ బీలు, ఇతర పని ముట్లు అందిస్తున్నామని చెప్పారు. కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ నగరంలోని కార్మికుల కోసం 15 వాహనాలు కొనుగోలు చేశామని, ఒక్కొక్క వాహనాన్ని ఐదు మందిని గ్రూపుగా కలిసి అందిస్తామని చెప్పారు.